సరిహద్దు సరిగా లేదు.!



బాలానగర్ తహసీల్దార్ కార్యాలయం



తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయం

- అయోమయంలో ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ ప్రజలు
- రెండు రెవెన్యూ డివిజన్లు, రెండు ఠాణాల పరిధిలోకి ఓల్డ్‌బోయిన్‌పల్లి
- కొన్ని ప్రాంతాలు ఏ తహసీల్, ఏ ఠాణా పరిధిలోకి వస్తుందో తెలియని పరిస్థితి
- మా పరిధిలోకి రాదంటే.. మా పరిధిలోకి రాదంటూ తప్పించుకుంటున్న అధికారులు
- ఇదే అదునుగా భావించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల భూములు మింగేస్తున్న కబ్జాదారులు
- ఈ స్థలాలకు ఎన్‌ఓసీలు జారీ చేయడంపై రెవెన్యూ అధికారులపై విమర్శల వెల్లువ
- అయోమయ స్థితిలో కార్ఖానా, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్ పోలీసులు
- సరైన సరిహద్దులు నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్న డివిజన్ ప్రజలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధి రెండు రెవెన్యూ డివిజన్లు, రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలోకి రావడంతో అయోమయ పరిస్థితి నెలకొంది. అంజయ్యనగర్ రెండు తహసీల్దార్ కార్యాలయాలు, రెండు పోలీసుస్టేషన్లు రావడంతో ఏదైన సమస్య తెలెత్తినప్పుడు అధికారులు ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణాల అనుమతులకు.. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులకు వెళ్తే ఇది పరిధిలోకి రాదంటూ అధికారులే అనడం గమనార్హం. ఫలాన ప్రాంతం తమ పరిధిలోనిదే అని అధికారులు పక్కాగా చెప్పలేకపోతున్నారు. దీంతో ప్రజలకు త్వరగా న్యాయం జరగడం లేదు. భూములు, కబ్జాలు తెగని పంచాయితీగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రెవెన్యూ డివిజన్ల సరిహద్దుల విషయంలో సరైన విధానం లేకపోవడంతో వివాదాలు నెలకొంటున్నాయి. ఏ మండలం పరిధిలోకి ఏ స్థలం వస్తుందో తెలియక అధికారులు తికమక పడుతుంటే కొందరు ఇదే అదునుగా భావించి స్థానికంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను స్వాహా చేస్తున్నారనే ఆరోపణాలు బలంగా వినిపిస్తున్నాయి. అంజయ్యనగర్‌లో గతంలో ప్రభుత్వ స్థలంలో ఓ బస్తీనే ఏర్పాటు చేసి స్థలాలు అమ్ముకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవచ్చు.

ఏ మండల పరిధిలోకి వస్తుందో అధికారులకే తెలియదు!

◆ ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లోని అంజయ్యనగర్ రెండు మండల కార్యాలయాల పరిధిలోకి రావడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అంజయ్యనగర్ ప్రాంతం అటు బాలానగర్ ఇటు తిరుమలగిరి మండలాల పరిధిలోకి వస్తుండటంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. 30ఏళ్ల క్రితం ఉన్న రేకుల ఇళ్లను తొలగించి నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టాలంటే తల ప్రాణం తోకకు వస్తుందని ప్రజలు వాపోతున్నారు. గతంలో ఇళ్లు కట్టుకోనివ్వడం లేదని ప్రజలు వంటిపై కిరోసిన్ పోసుకున్న సంఘటనలూ ఉన్నాయి. ఇది బాలానగర్ మండలం పరిధిలోకి వస్తుందని కొందరంటే లేదు తిరుమలగిరి మండల పరిధిలోకి వస్తుందని మరకొందరి వాదన ఉన్నప్పటికి ఆ ప్రాంతం ఏ మండల పరిధిలోకి వస్తుందో అధికారులకే సరిగా తెలియకపోవడం గమనార్హం.

రెండు పోలీస్ స్టేషన్లు, రెండు మండలాలు...

◆ ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ రెండు పోలీస్ స్టేషన్లు, రెండు రెవెన్యూ మండలాల పరిధిలోకి రావడంతో అంతా అయోమయంగా తయారైంది. గతంలో బోయిన్‌పల్లి వ్యవసాయ కూరగాయల మార్కెట్‌కు అనుకుని ఓ వర్గానికి చెందిన శ్మశానవాటిక ఉంది. దాని పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని కాబ్జా చేస్తున్నారని స్థానికులు గోడను కూల్చివేశారు. ఈ విషయంపై వివాదం నెలకొనడంతో తిరుమలగిరి మండల అధికారులు వచ్చారు. ఈ స్థలం ఎవరిది అనేది విచార చెపడతామని చెప్పడం వరకు బాగానే ఉంది. వివాదం స్థలం ఏ పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుందో తెలియక తిరుమలగిరి, బోయిన్‌పల్లి, కర్ఖానా, అల్వాల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తికమక పడ్డారు. ఇలా సరిహద్దుల లొల్లితో డివిజన్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని సోని కాంప్లెక్స్‌లో మహిళల స్వయం ఉపాధి కోసం బ్యూటీషియన్, టైలరింగ్, మగ్గం వర్క్, జూట్ బ్యాగ్‌ల తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్. సంజీవరెడ్డి ఫౌండేషన్ నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత శిక్షణలో పాల్గొనే వారు ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు ఫొటోలతో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. బ్యాచ్‌కి 10 సీట్లు మాత్రమే ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం .9396161936 సంప్రదించాలని కోరారు.

ఉద్యోగ విరమణ


అరుణ్ జనార్దన్‌ను సత్కరిస్తున్న కార్మిక నాయకుడు కర్క నాగరాజు

బాలానగర్: హెచ్‌ఏఎల్ జనరల్ మేనేజర్ అరుణ్ జనార్దన్ సర్కాటే ఉద్యోగ విరమణ పొందారు. హెచ్‌ఏఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు కర్క నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం సౌత్ గేట్ వద్ద వీడ్కోల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ జనార్దన్‌ను సత్కరించి అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఖాజా బషీరుద్దీన్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సిబ్గాతుల్లాహ్, పరిశ్రమ అధికారులు, వివిధ ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫార్క్స్ డే ఈవెంట్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ కార్పొరేట్ కంపెనీ సింక్రొనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫార్క్స్ డే ఈవెంట్ ఆకట్టుకుంది. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో ఉన్న నొవోటెల్ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా పలు విందు, వినోదాలు సందడిగా సాగాయి. మల్ల ఖంబా యాక్ట్, దివ్యాన్ష్, మనురాజ్‌ల ప్రత్యేక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఐటీ సంబంధిత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గడప గడపకు బీజేపీ


హైదర్‌నగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న రవికుమార్ యాదవ్

భాగ్యనగర్‌కాలనీ: గడప గడపకు బీజేపీ రవన్న ప్రజా యాత్రలో భాగంగా హైదర్‌నగర్ డివిజన్‌లోని జై భారత్‌నగర్, సెవన్ హిల్స్, అల్లాపూర్ సొసైటీ, నాగార్జున హోమ్స్ కాలనీల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ స్థానిక బీజేపీ నాయకులతో కలిసి మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదర్‌నగర్ డివిజన్‌ను అన్ని రకాలుగా ఆగమాగం చేశారన్నారు. బీజేపీ పార్టీకి ఓటు వేస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ జానకీరామరాజు, డివిజన్ అధ్యక్షుడు సీవన్‌గౌడ్, ఓబీసీ మోర్చా శేషయ్య, బీజేవైఎం నాయకులు అరుణ్‌కుమార్, అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామాలయ వార్షికోత్సవం

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని శివమ్మ కాలనీలోని శ్రీరామాలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ రామచందర్, వైస్‌చైర్మన్ కాయిత నరసింహులు, జనరల్ సెక్రటరీ సిద్దయ్య, డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, గౌరవ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

జీడిమెట్ల: క్షణికావేశంలో ఓ యువకుడు ఉరి వేసుకుని మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సురేష్‌ప్రసాద్ బతుకుదెరువు కోసం హైదరాబాద్ వచ్చి జీడిమెట్ల ఫేజ్–3లోని కామధేను గ్యాస్ కంపెనీలో పని చేస్తూ అక్కడే ఉంటున్నారు. సురేష్‌ప్రసాద్ చిన్న కుమారుడు అజయ్‌కుమార్ కర్వాల్(23) సైతం అదే పరిశ్రమలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో మాట్లాడిన అజయ్‌కుమార్ చిన్నపాటి విషయానికే కోపోద్రిక్తుడు అయ్యాడు. తండ్రి నిద్రకు ఉపక్రమించిన అనంతరం అజయ్‌కుమార్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందాడు. ఇది గమనించిన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ముఖ్యమంత్రి సహాయ నిధి దరఖాస్తు చేసుకోగా మంజూరైన 39 మంది లబ్ధిదారులకు రూ.13,04,800 చెక్కులను మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా సీఎంఆర్‌ఎఫ్ ఆదుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు ఊట్ల చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: పాపమ్మ బస్తీ నుంచి చంద్రమ్మ కాలనీ వరకు రూ.12.5 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అదేవిధంగా సీసీ రోడ్ల కోసం రూ.5లక్షల అదనపు నిధులను మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, గౌరవ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు చిన్నోళ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గేడ్ల శ్రీనివాస్, ఏడుపాయల శ్రీను, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు నివారణకే రిటైనింగ్ వాల్ నిర్మాణం


మూసాపేట డివిజన్‌లో పర్యటిస్తున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

మోతీనగర్: మూసాపేట్ డివిజన్ పరిధిలోని బబ్బుగూడ, కబీర్‌నగర్, అవంతినగర్‌లలో మంగళవారం మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కబీర్‌నగర్‌లో నాలా పక్కన ఉండే వారు వర్షాకాలంలో ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో నాలా రిటైనింగ్ వాల్ పనులు చేపట్టామన్నారు. ఈ పనులు పూర్తయితే ముంపు సమస్య ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, నాగుల సత్యం, తిరుపతి, మాజీద్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


కల్కి సరోవర్‌లో నీటి సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వం లక్ష్యం అని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని కల్కి సరోవర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మంజీరా మంచినీటి కుళాయిలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో నీరు లేక ఇబ్బందులు పడేవారని, నేడు ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామన్నారు. అదే విధంగా 2 వేల లీటర్ల ఉచిత మంచినీటిని అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీవాసులు రాంచంద్రం, పీఎస్ రావు, నర్సింహ్మా, శ్రీధర్, అన్సారీ, రమాదేవి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

30 కేజీల కణతి తొలగింపు


చికిత్స చేస్తున్న శ్రీశ్రీహోలిస్టిక్ ఆస్పత్రి వైద్యులు

భాగ్యనగర్‌కాలనీ: నిజాంపేట్ రోడ్డులోని శ్రీశ్రీ హోలిస్టిక్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స చేసి 30 కేజీల కణతిని వైద్యులు విజయవంతంగా తొలగించారు. కల్వకుర్తికి చెందిన మల్లయ్య (47)కు కడుపులో పదే పదే నొప్పి రావడంతో శ్రీశ్రీహోలిస్టిక్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించాడు. కడుపులో 30కిలోల పైగా బరువున్న కణతిని గుర్తించారు. సుమారు 4గంటలకు పైగా శ్రమించి అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి కణతిని విజయవంతంగా తొలగించారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యుడు రాంప్రసాద్, యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ.. సరైన సమయంలో కణతిని తొలగించటం ద్వారా కేన్సర్ మహమ్మారి నుంచి కాపాడగలిగామని అన్నారు. చికిత్స తర్వాత పేషెంట్ పూర్తిస్థాయి ఆరోగ్యంతో ఉన్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో డాక్టర్ అనూష, డాక్టర్ రాజేష్ ఖన్నా మత్తు వైద్య నిపుణులు పాల్గొన్నారు.



1 నుంచి మెగా లోక్ అదాలత్

హఫీజ్‌పేట్: కూకట్‌పల్లి కోర్టులో జూన్ 1 నుంచి మెగా లోక్ అదాలత్ జరుగుతుందని మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బిల్లా కిరణ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్స్ లేని కేసులలో పట్టుబడిన వారు మియాపూర్ ట్రాఫిక్ స్టేషన్‌కు ఆధార్ కార్డు, వాహన ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్ జిరాక్స్ 3 కాపీలు, ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్‌ను తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరు ఉదయం 8 గంటలకు హాజరవ్వాలన్నారు.

కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్‌లోని శ్రీకట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కుంకుమార్చనల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం రంగారావు, రవికిరణ్ భక్తులకు అన్నదానం నిర్వహించారు.

డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు షురూ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2023–24 సంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్ల రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కోసం విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో మీ సేవ సెంటర్ లో (లేదా) కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు బీఏ, బీకాం, కంప్యూటర్, బీఎస్సీలో ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంసీసీఎస్ ,బీజెడ్ సీ,బీజెడ్ సీఎస్ గ్రూప్‌లలో ఇంగ్లిష్, తెలుగు మీడియంలలో సుమారు 720 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొదటివిడతలో రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు చివరి తేదీ జూన్10 అని తెలిపారు.

యువకుడి అదృశ్యం


లోకేష్ (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: ఇంటి నుంచి బయటకి వెళ్లిన ఓ విద్యార్థి అదృశ్యమైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లామోతే మండలం గోల్ తండాకు చెందిన గుగులోతు లోకేష్ (23) బాచుపల్లిలో నివాసం ఉంటూ విజ్ఞాన్ జ్యోతి కళాశాలలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. సోమవారం రాత్రి తన తండ్రికి ఫోన్ చేసి మాట్లాడాడు. అయితే తండ్రి శంకర్ ఏదైనా ఉంటే ఉదయం మాట్లాడుకుందాం అని కుమారుడితో పేర్కొన్నాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన లోకేష్ తన తండ్రి వాట్సప్‌లో కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీలోని పద్మావతి ప్లాజా వద్ద తన ద్విచక్ర వాహనాన్ని పార్కు చేశానని మెసేజ్ చేసి అదృశ్యమయ్యాడు. తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

14న ఘనంగా వైద్యారోగ్య దినోత్సవం

- 13న మహిళా సంక్షేమం, 20న విద్యా దినోత్సవం ఏర్పాట్లపై కసరత్తు
- జిల్లా సమన్వయం సమావేశంలో నిర్ణయం



సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై మంగళంవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అధ్యక్షతన మేడ్చల్ జిల్లా కో ఆర్డినేషన్ సమావేశం జరిగింది. జూన్ 2 నుంచి 21 రోజుల పాటు జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఐక్యతతో ముందుకు సాగాలని నిర్ణయించారు. సమావేశానికి హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి, మహిళా, శిశు అభివృద్ధి, వృద్ధులు, వికలాంగుల సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి అక్కేశ్వర్‌రావు దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, విధివిధానాలపై చర్చించి, తగిన సూచనలు, సలహాలు అందజేశారు. జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న ప్రాథమిక / పట్టణ ఆరోగ్యకేంద్రాలు, బస్తీ, పల్లె దవాఖానాలు, ఏరియా, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జూన్ 14 జిల్లా వైద్య ఆరోగ్యశాఖ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. నియోజకవర్గం స్థాయిలో కేసీఆర్ కిట్, న్యూట్రీషన్, సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులు, వైద్యశాఖ సిబ్బంది తదితరులను ఆహ్వానించి సభ నిర్వహించాలని నిర్ణయించారు. వైద్యరంగంలో తెలంగాణ సాధించిన ప్రగతిని వివరించడం ద్వారా ప్రజల్లో ప్రచారం చేయాలని నిర్ణయించారు. మాతా, శిశు సంరక్షణ సేవలు, ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రజలకు వివరించాల్సి ఉంటుంది. వైద్య ప్రగతిపై కరపత్రాల పంపిణీతోపాటు రోగులకు పండ్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. అలాగే, ఉత్తమ ఆశ వర్కర్, ఏఎన్‌ఎం, స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నిషియన్, డాక్టర్లను ఘనంగా సన్మానించి, అవార్డులు అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూన్ 13న మహిళా సంక్షేమ దినోత్సవం, జూన్ 20న తెలంగాణ విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.

త్వరలో జింకలవాడ రిటర్నింగ్ వాల్ పనులు పూర్తి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని జింకలవాడలో నాలా రిటర్నింగ్ వాల్ పనులను మంగళవారం డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పరిశీలించారు. ప్రతి వర్షాకాలంలో నాలాలోని నీళ్లు ఇళ్లలోకి వచ్చేవని ఆయన గుర్తు చేశారు. ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పెషల్ బడ్జెట్ కింద నిధులు మంజూరు చేశారని తెలిపారు. డీఈ శ్రీదేవి, ఏఈ పవన్‌రెడ్డితో కలిసి నాలా రిటర్నింగ్ వాల్ పనులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికి 80శాతం పనులను పూర్తి చేశామని మిగిలిన పనులను అతి త్వరలో పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

పసిబిడ్డ ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

గచ్చిబౌలి: ప్రాణాపాయస్థితిలో ఉన్న ఓ పసికందుకు వైద్య సపర్యలు చేసి కాపాడారు 108 సిబ్బంది . కొండాపూర్ 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...... కొండాపూర్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో మంగళవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో సుష్మితదాసు అనే మహిళ మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే పసికందు పల్స్ పడిపోయిందని, వెంటనే నిలోఫర్ ఆస్పత్రికి తరలించాలని చెప్పడంతో 108కు సమాచారం అందించారు. దీంతో 108 సిబ్బంది పైలెట్ జలీల్, ఈఎంటీ నరేష్ పసికందును తీసుకొని నిలోఫర్ ఆస్పత్రికి బయలుదేరారు. ఈ క్రమంలో నరేష్ పసికందుకు వైద్య సపర్యలు చేసి ఊపిరి నిలిపాడు, గుండె ఆగిపోకుండా ఎన్‌ఎస్‌ఆర్ (సీపీఆర్ తరహాలో చిన్నపిల్లలకు చేసే ప్రక్రియ) చేశారు. శిశువుకు అవసరమైన ఆక్సిజన్ వెంటిలేటర్ సహాయంతో అందిస్తూ నిలోఫర్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల పర్యవేక్షణలో బిడ్డ పరిస్థితి బాగానే ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పైలెట్ జలీల్, ఈఎంటీ నరేష్‌కు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌సీ ఆధునీకరణకు ముందుకొచ్చిన రహేజా గ్రూపు

- మరిన్ని మౌలిక వసతులకు రూ.45 లక్షల సీఎస్‌ఆర్ నిధులు కేటాయింపు
- ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ కలిసి జిల్లా వైద్యాధికారులకు చెక్కు అందజేత


రహేజా గ్రూపు ఇచ్చిన చెక్కును జిల్లా వైద్యాధికారులకు అందజేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధునీకరణకు మార్గం సుగమం అయ్యింది. ఈ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధునీకరణకు రహేజా గ్రూపు సీఎస్‌ఆర్ నిధులు కేటాయించేందుకు ముందుకొచ్చింది. మంగళవారం చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటిశ్రీకాంత్‌లు కలిసి రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సృజనలకు సంస్థ అందించిన రూ.45 లక్షల చెక్కును అందజేశారు.

◆ ఈ సందర్భంగా ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా శేరిలింగంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆధునీకరించాలని ఆలోచన ఉందన్నారు. ఈ కోరిక రహేజా గ్రూపు సీఎస్‌ఆర్ గ్రూపు సీఎస్‌ఆర్ నిధుల ద్వారా ఆధునీకరణకు మార్గం సుగమమవుతోందన్నారు. ఈ పట్టణ ఆరోగ్య కేంద్రం అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

◆ ఈ పట్టణ ఆరోగ్య కేంద్రంలో సివిల్ వర్క్స్, శానిటరీ సౌకర్యాలు, తాగునీరు, ఎలక్ట్రిసిటీ, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ఈ నిధులను కేటాయించాలని అధికారులకు వారు సూచించారు. శేరిలింగంపల్లి ప్రజల పక్షాన రహేజా గ్రూపు ప్రతినిధులకు, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దానికి ప్రైవేటు సంస్థలు కూడా తమ వంతు బాధ్యతగా చేయూతను అందించేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. రహేజా గ్రూపును ఇతర సంస్థలన్నీ కూడా ఆదర్శంగా తీసుకోవాలన్నారు.